క్లుప్తంగా

కార్మికులకు అండగా సీఎం జగన్



ఆటో డ్రైవర్లతో డెప్యూటీ మేయర్ షేక్ సజిల

పట్నంబజారు: కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా అండగా ఉంటారని నగర డెప్యూటీ మేయర్ షేక్ సజిల చెప్పారు. వైఎస్సార్ వాహన మిత్రలో భాగంగా ఐదోసారి శుక్రవారం రూ. 10వేలు చొప్పున సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆర్థిక సాయం అందించిన నేపథ్యంలో ఆటోడ్రైవర్లకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా డెప్యూటీ మేయర్ సజిల మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం సీఎం వై.ఎస్. జగన్ పాలనలోనే సాధ్యపడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

కులవృత్తిని సంరక్షించుకోవాలి

నెహ్రూనగర్: ఆధునిక సెలూన్లు ప్రారంభించి క్షవర వృత్తిని సంరక్షించుకోవాలని నాయీ బ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు సూచించారు. జేకేసీ కాలేజీ రోడ్డులో రంగ సన్ ఆధునిక సెలూన్ లోగో ఆవిష్కరణ శుక్రవారం నాయీ బ్రాహ్మణ ముఖ్య నాయకుల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణలు వృత్తిని దైవంగా భావించి జీవనం సాగిస్తున్న ప్రస్తుత తరుణంలో కార్పొరేట్ సంస్థలు, ధనికవర్గ పెత్తందారులు ప్రవేశించడం దారుణమని ఖండించారు. కోట్ల రూపాయిల పెట్టుబడి పెట్టి బ్యూటీ పార్లర్ పేరుతో సెలూన్ రంగంలోకి ప్రవేశించి, అసలైన నాయీ బ్రాహ్మణ క్షవర వృత్తిదారుల పొట్టకొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సమాజంలో కార్పొరేట్ శక్తులకు దీటుగా నాయీ బ్రాహ్మణులు ఆధునిక సెలూన్లు ఏర్పాటు చేసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని ఆయన తెలిపారు.

స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడిగా సుబ్బయ్య

నెహ్రూనగర్: స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడిగా పాలిపోగు సుబ్బయ్య మాదిగ నియమితులయ్యారు. కాకాని రోడ్డులోని సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయనకు వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధన కోసం కృషి చేస్తూ, నగర ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు.

ఎం.ఎస్. స్వామినాథన్‌కు ఘన నివాళి

లక్ష్మీపురం: హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్. స్వామినాథన్ మృతి వ్యవసాయ రంగానికి తీరని లోటని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఆహార వృద్ధిలో భారత్ స్వయం సమృద్ధి సాధించేందుకు స్వామినాథన్ అందించిన సేవలు అమోఘమని కొనియాడారు. ఆయక కృషే దేశాన్ని ఆహారోత్పత్తిలో బలోపేతం చేసిందని తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను సుసంపన్నం చేసిందని చెప్పారు. స్వామినాథన్ సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నంబూరు వీవీఐటీలో ఉద్గమా -2023



ఉద్గమా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు

పెదకాకాని: స్థిరమైన శక్తికి పునరుత్పాదక విద్యుత్ అవసరం చాలా ఉందని, అందులో సౌరశక్తి కీలకమని విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి కె.ఎస్.సాయిబాబా అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఐఈఈఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం సుస్థిరాభివృద్ధి లక్ష్యలో భాగమైన చౌకగా సుస్థిర శక్తి వనరులు అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తలుగా విశ్రాంత ఐఎఫ్ఎస్ అధికారి కె.ఎస్.సాయిబాబా, ఐఈఈఈ శాక్ సంధానకర్త తారా సాయికుమార్, అంతర్జాలం ద్వారా సింగపూర్‌కు చెందిన ఐఈఈఈ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ దీపక్ మైకర్ హాజరయ్యారు. సాయిబాబా మాట్లాడుతూ భారతదేశంలో జల, సౌర, పవన శక్తి వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. 2050 నాటికి భూమిపై కర్బన్ ఉద్గారాలను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. అణుశక్తి వినియోగం పెరగాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా 12 కళాశాలల నుంచి 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, డీన్ అకడమిక్ డాక్టర్ డాక్టర్ కె.గిరిబాబు, ఐఈఈఈ గుంటూరు శాఖ సభ్యుడు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ స్వర్ణశ్రీ, ప్రోగ్రాం సంధానకర్త ఎంఆర్ఎస్ ఠాగూర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’తో ప్రతి ఒక్కరికీ భరోసా

కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికీ ఆరోగ్య భరోసా లభిస్తుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి పేర్కొన్నారు. నగరంలో శనివారం నుంచి జరగనున్న శిబిరాల ఏర్పాటుపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, నగరపాలక సంస్థ అధికారులతో శుక్రవారం తన క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఈ నెల 30 నుంచి నవంబర్ 15 వరకు నిపుణులైన వైద్యులతో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా నగరంలోని 29 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల వద్ద శిబిరాలు జరుగుతాయని పేర్కొన్నారు. అందుకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఎస్ఈని, వైద్య సిబ్బందిని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని సమన్వయం చేసుకోవాలని డెప్యూటీ కమిషనర్లను ఆదేశించారు. ప్రతి సెంటర్‌లో రోజుకి 15 వందల మందికి వైద్య పరీక్షలు చేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రతి సచివాలయ కార్యదర్శి క్యాంప్‌లో భాగస్వాములు అయ్యేలా చూడాలని నోడల్ అధికారుల్ని ఆదేశించారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారికి నివేదికతో పాటు అవసరమైన మందులతో కిట్‌ని అందించాలని చెప్పారు. ప్రతి శిబిరంలో జనరల్ మెడిసిన్ స్పెషలిస్ట్, గైనకాలజిస్ట్‌తో పాటుగా ఇద్దరు ఎంబీబీఎస్ వైద్యులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. అవసరమైతే అందుబాటులోని హాస్పిటల్‌ల్లో చేర్పి చికిత్స అందిస్తారని, ఆరోగ్యశ్రీ ద్వారా కూడా ఉచితంగా శస్త్ర చికిత్సలు కూడా చేస్తారని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణ్ కుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ జయ రామకృష్ణ, ఎస్ఈ భాస్కర్, సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సీహెచ్.శ్రీనివాస్, ఎంహెచ్‌వో డాక్టర్ భాను ప్రకాష్, మేనేజర్ శివన్నారాయణ, సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

పిల్లల్ని వారికి ఆసక్తి ఉన్న ఆటల్లో పాల్గొనేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి సూచించారు. గుంటూరు నగరం నుంచి జాతీయ స్థాయి ఐస్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల్ని శుక్రవారం తన చాంబర్‌లో ఆమె అభినందించారు. నగరంలోని బీఆర్ స్టేడియంలో ఈ నెల 14న జరిగిన ఐస్ స్కేటింగ్ నేషనల్ సెలక్షన్ పోటీల్లో గుంటూరు నగరానికి చెందిన ఐకేఎస్ఏ స్కేటింగ్ అకాడమి క్రీడాకారులు ఒక బంగారు, ఐదు వెండి, రెండు కాంస్య పతకాలు సాధించి, డిసెంబర్‌లో గుర్గావ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం అభినందనీయమని తెలిపారు. నగరంలోని పార్కుల్లో పిల్లలు ఆడుకోవడానికి ప్రత్యేక స్థలం కేటాయిస్తున్నామని చెప్పారు. త్వరలో స్కేటింగ్ రింక్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా చిన్నారులకు శిక్షణ ఇచ్చిన స్కేటింగ్ కోచ్‌లు ఇమ్రాన్, అప్సర్‌ను ఆమె అభినందించారు.

కార్పొరేటర్ల ఫిర్యాదుల పరిష్కారంపై నివేదిక ఇవ్వాలి

కార్పొరేటర్ల నుంచి అందే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారంపై వార్డుల వారీగా నివేదిక ఇవ్వాలని విభాగాధిపతులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. తన చాంబర్‌లో శుక్రవారం కార్పొరేటర్లతో వార్డుల్లో అభివృద్ధి పనులు, స్థానిక సమస్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే ప్రజా సమస్యల పరిష్కారం, నగర సమగ్రాభివృద్ధి సాధ్యమని తెలిపారు. కార్పొరేటర్ల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదులు, ప్రతిపాదనల్ని క్రమ పద్ధతిలో రికార్డ్ చేసి, తదుపరి చర్యలు వారికి తెలపాలని అధికారుల్ని ఆదేశించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి: మేయర్



అధికారులతో సమావేశమైన మేయర్ కావటి

నెహ్రూనగర్: నగరాభివృద్ధికి, మౌలిక వసతుల కల్పనకు పాలక వర్గం ప్రతిపాదించిన పనుల్లో నాణ్యత తప్పనిసరని మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు.తన చాంబర్‌లో శుక్రవారం పనులపై ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా డివిజన్లు, కాంట్రాక్టర్ల వారీగా పనులు, పురోగతి గురించి సమీక్ష నిర్వహించారు. పనుల్ని స్థానిక ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు నిర్వహించాలని చెప్పారు. నగరాభివృద్ధిలో కాంట్రాక్టర్లు కూడా భాగస్వాములు కావాలని తెలిపారు. టెండర్లు దక్కించుకొన్న వెంటనే పనుల్ని త్వరితగతిన ప్రారంభించి, నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని కోరారు. సమస్యల్ని తన దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బిల్లులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కాంట్రాక్టర్లు సమావేశంలో కోరారు. ప్రాధాన్యతా క్రమంలో ఇప్పించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో ఎస్ఈ భాస్కరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే స్థిరమైన లక్ష్యం అవసరం

ఇస్రో శాస్త్రవేత్త బొల్లు మానస



మానసకు జ్ఞాపిక బహూకరిస్తున్న విష్ణువర్ధన్, వరప్రసాదరావు

గుంటూరు ఎడ్యుకేషన్: జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలనుకునే విద్యార్థులు స్థిరమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలని చంద్రయాన్–3 ప్రాజెక్టులో భాగస్వామురాలైన ఇస్రో ‘ఈ’ విభాగ శాస్త్రవేత్త బొల్లు మానస సూచించారు. లక్ష్మీపురం మెయిన్ రోడ్డులోని శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం అంతరిక్షయానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా పాల్గొన్నారు. చంద్రయాన్–3, ఆదిత్య ఎల్–1 ప్రయోగాల్లో ఇస్రో శాస్త్రవేత్తల కృషిని, శ్రమను విద్యార్థులతో పంచుకున్నారు. శాస్త్రవేత్తలుగా ఎదగాలనే లక్ష్యాన్ని కలిగి ఉండటంతో అందుకు తగిన విధంగా ప్రణాళికతో చదవాలని సూచించారు. అంతరిక్ష ప్రయోగాలు, పరిశోధనల్లో ఇస్రో సాధించిన విజయాల గురించి వివరించారు. భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాల్ని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ చంద్రయాన్–3 ప్రయోగంలో భాగమైన శాస్త్రవేత్త బొల్లు మానస పాఠశాలకు వచ్చి, విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేలా ప్రసంగించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మానసను సత్కరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త మానస మాతృమూర్తి వనజ, పాఠశాల కమిటీ ప్రత్యేక ఆహ్వానితులు వల్లూరు తాండవకృష్ణ, గుంటూరు తిరుపతిరెడ్డి, పాఠశాల కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, నూరిఫాతిమా, రాజనారాయణ తదితరులు

పట్నంబజారు: విఘ్నేశ్వరుని ఆశీస్సులతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన ప్రజలకు అందిస్తున్నారని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని నెహ్రూనగర్‌లో శుక్రవారం మిర్చి యార్డు మాజీ వైస్ చైర్మన్ ఎర్రబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చవితి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని విఘ్నాలు తొలగిపోయి, ప్రజలందరికీ మేలు జరగాలని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతున్న సీఎం జగన్‌కు మరింత మనోధైర్యం కల్పించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, డైరెక్టర్లు కోటా గంగా భవాని, రాందాస్, పల్లా శ్రీనివాసరావు, మల్లెమూడి సతీష్ పాల్గొన్నారు.

జ్వలించే నిప్పు కణిక భగత్ సింగ్



ఏఎన్‌యూ: జ్వలించే నిప్పు కణిక భగత్ సింగ్ అని వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అన్నారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా వర్సిటీలోని ఆయన విగ్రహానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆనాటి స్వాతంత్ర్య సంగ్రామంలో భగత్ సింగ్ పోషించిన వీరోచిత పాత్రను యువత గుర్తుంచుకోవాలని చెప్పారు. విద్యార్థులంతా ఆయనలోని దేశభక్తిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రెక్టార్ పి. వరప్రసాద్ మూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ, విశ్వవిద్యాలయ అధ్యాపక సంఘం అధ్యక్షుడు డాక్టర్ బి.నాగరాజు, యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాల్స్ సీహెచ్. స్వరూపరాణి, పి. సిద్ధయ్య, జాన్సన్, ఈ. శ్రీనివాసరెడ్డి, కె. సునీత, ఇంజినీర్ కుమార్ రాజా పాల్గొన్నారు.

కార్మికులకు కొండంత అండ సీఎం జగన్

ఎమ్మెల్యే ముస్తఫా



ఆటో నడుపుతున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: ఆటోవాలాలకు అన్నగా... కార్మికులకు కొండంత అండగా ... తానున్నాననే భరోసా కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. వైఎస్సార్ వాహనమిత్ర ఐదో విడత ఆర్థిక సాయం అందించిన నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ వద్ద వైఎస్సార్ కార్మిక సంక్షేమ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే ముస్తఫా, కుమార్తె నూరిఫాతిమాతో కలసి ఆటో నడుపుతూ ఆటోడ్రైవర్లలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్రలో ఆటోడ్రైవర్ల కష్టాలు తెలుసుకున్న సీఎం వై.ఎస్.జగన్ ఇచ్చిన మాటకు కట్టుబడి వైఎస్సార్ వాహన మిత్ర ద్వారా ప్రతి ఒక్కరికీ రూ. 10వేలు చొప్పున ఐదు దఫాలుగా ఇప్పటి వరకు అందజేశారని తెలిపారు. బతుకు బండి లాగేందుకు బండి నడుపుతున్న ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల కోసమే ఓ గొప్ప పథకాన్ని నవరత్నాల్లో సమకూర్చారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా మాట్లాడుతూ ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఇన్స్యూరెన్సు, ఇతర ఖర్చుల కోసం వైఎస్సార్ వాహన మిత్ర ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. సీఎం వై.ఎస్.జగన్ అందించిన సాయాన్ని ఆటోడ్రైవర్లు గుర్తుపెట్టుకున్నారని, కచ్చితంగా రానున్న ఎన్నికల్లో తిరిగి మరోమారు ఆయన్ను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు పవన్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

8న రాజ్యాంగ చర్చా వేదిక ఆవిర్భావ సభ



మాట్లాడుతున్న గురుదత్, హరి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: నగరంలో అక్టోబర్ 8న రాజ్యాంగ చర్చా వేదిక ఆవిర్భావ సభ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు, న్యాయవాది నడింపల్లి గురుదత్ తెలిపారు. అరండల్‌పేటలోని ఓ హోటల్లో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశమంతటా స్వాతంత్ర్య దిన వజ్రోత్సవాల్ని జరుపుకుంటున్న సమయంలో భారత ప్రజాస్వామ్యం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. పౌరుల హక్కులు, బాధ్యతలు, రాజ్యాంగ వ్యవస్థల సక్రమ నిర్వహణ, చట్టబద్ధ పాలనకు రాజ్యాంగమే శిరోధార్యమని నమ్ముతూ నూతనంగా ఏర్పాటు చేసిన రాజ్యాంగ చర్చావేదిక ఆవిర్భావ సభను అక్టోబర్ 8వ తేదీ ఉదయం 10 గంటలకు అరండల్‌పేటలోని గీతా రీజెన్సీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యదర్శి అవధానుల హరి మాట్లాడుతూ భారత రాజ్యాంగం, పౌరుల హక్కులు, బాధ్యతలపై రాజకీయాలకతీతంగా సమాజాన్ని చైతన్యవంతం చేయాలనే లక్ష్యంతో న్యాయవాదులు, డాక్టర్లు, మేధావుల సంయుక్త ఆధ్వర్యంలో రాజ్యాంగ చర్చా వేదిక రూపుదిద్దుకుందని చెప్పారు. ఆవిర్భావ సభకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. మన్మథరావు ముఖ్య అతిథిగా పాల్గొననుండగా, గౌరవ అతిథిగా ప్రొఫెసర్ ఏ. రాజేంద్రప్రసాద్ హాజరు కానున్నారని వివరించారు. కార్యక్రమంలో చర్చా వేదిక సహాయ కార్యదర్శి డాక్టర్ తాతా సేవ కుమార్, ఆడిటర్ పి.వి.మల్లికార్జునరావు, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త జొన్నలగడ్డ రామారావు, కిలారి రాజన్ బాబు, వై.వి.ఎస్. మహదేవ్ పాల్గొన్నారు.

నేషనల్ గ్రూప్ సాంగ్ పోటీల్లో సుమేధ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న మల్లికార్జునరావు, నాగరాజు శేఖర్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: భారత వికాస్ పరిషత్ గుంటూరు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ గ్రూప్ సాంగ్ పోటీల్లో సుమేధ హైస్కూలు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎన్జీవో కాలనీలోని పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో గురువారం జరిగిన పోటీల్లో భాగంగా వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్న విద్యార్థులతో పోటీ పడిన తమ పాఠశాల విద్యార్థుల బృందం ప్రథమ స్థానంతో పాటు జానపద విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు. అక్టోబర్ ఒకటో తేదీన విజయవాడలో జరగనున్న జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల్ని భారత్ వికాస్ పరిషత్ కన్వీనర్ బి. శ్రీరాములు, కన్వీనర్ భైరిశెట్టి మల్లికార్జునరావు, అధ్యక్షుడు తూనుగుంట్ల నాగరాజు శేఖర్, ప్రిన్సిపాల్ కె. రాంబాబు, కల్చరల్ టీచర్స్ కృష్ణవేణి, అనంతలక్ష్మి, నీలు అభినందించారు.

ఆకట్టుకున్న పురాతన నాణేలు, స్టాంపుల ప్రదర్శన



ప్రదర్శనలో ఏర్పాటు చేసిన స్టాంపులు, కరెన్సీ నోట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన పురాతన నాణేలు, స్టాంపులు, వివిధ దేశాల కరెన్సీ నోట్లు ప్రదర్శన ఆకట్టుకుంది. ముఖ్య అతిథిగా గుంటూరు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ యలమందయ్య పాల్గొని, ప్రదర్శన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ 100 దేశాల కరెన్సీ నోట్లు, 20 దేశాల వెండి నాణేలు, 60 దేశాల్లో మహాత్మాగాంధీ చిత్రంతో ఉన్న స్టాంపులు, జంతువుల బొమ్మలున్న నాణేలు, స్వాతంత్ర్యం రాక మునుపున్న నాణేలు, ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖుల పేర్లతో వచ్చిన స్టాంపులు సేకరించి ఎగ్జిబిషన్ నిర్వహించినట్లు వివరించారు. పాఠశాలలో ఏటా ఇదే విధంగా ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే విశ్రాంత ఉద్యోగి ఎం.వి.యస్. ప్రసాద్, తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ వై. మునిచంద్రారెడ్డి, పోస్టుమాస్టర్ వై. మాధవరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: వ్యక్తిపై పలువురు దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయినగర్‌లోని సాయిచైతన్య అపార్టుమెంటులో నివాసం ఉండే సానికొమ్ము వెంకట కృష్ణారెడ్డి రెండు నెలల నుంచి మెయింటెన్స్ చెల్లించలేదు. ఈ విషయంపై గురువారం అపార్టుమెంటులో నివసించే రాజశేఖరరెడ్డి, తిరుపతమ్మ, మరికొందరు వెంకట కృష్ణారెడ్డి వద్దకు వచ్చి, ఎందుకు చెల్లించడం లేదని అడిగారు. వివాదం పెద్దదైంది. రాజశేఖరరెడ్డి, తిరుపతమ్మ, మరికొందరు కలసి వెంకట కృష్ణారెడ్డిపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్టు

పట్నంబజారు: పేకాట ఆడుతున్న వ్యక్తుల్ని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటుకూరు రోడ్డులోని ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 10,900 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని మహిళకు గాయాలు

పట్నంజారు: కారు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వసంతరాయపురంలో శుక్రవారం సాయంత్రం ఓ యువకుడు పూటుగా మద్యం తాగి అతి వేగంగా కారు నడుపుతూ జొన్నలగడ్డ సువర్ణ కల్పనను ఢీకొట్టాడు. అనంతరం చెట్టును ఢీకొట్టడంతో నిలిచిపోయింది. గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, ప్రమాదానికి కారణమైన వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు.

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలలో వరల్డ్ హార్ట్ డే అవగాహన సదస్సు



ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల యాజమాన్యం విద్యార్థులు

గుంటూరు రూరల్: ఆధునిక జీవనశైలి, ఒత్తిడి కారణంగా అధిక శాతం మంది గుండె సంబంధిత సమస్యలకు లోనవుతున్నారని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన వరల్డ్ హార్ట్ డే సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించేందుకు క్రమబద్ధమైన ఆహారం వ్యాయామం అవసరమని, దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న ప్రపంచ హృదయ దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. డాక్టర్ ఎం బద్రీ నారాయణ మాట్లాడుతూ గుండె సంబంధిత సమస్యలు రావడానికి గల కారణాలను తెలియజేశారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులు అవగాహన ర్యాలీ, ప్లకార్డుల ప్రదర్శన చేశారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ వరల్డ్ హార్ట్ డే అంతిమ లక్ష్యం హృదయ సంబంధ వ్యాధులను తొలగించడమని తెలిపారు. వ్యాయామం సైక్లింగ్, మంచి ఆహారాన్ని తీసుకోవడం వలన గుండె సంబంధిత సమస్యలను నివారించుకోవచ్చని కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థిక చేయూత అవసరం



రాష్ట్ర పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రీడాకారులు విజయాలు సాధించాలంటే వారికి ఆర్థిక తోడ్పాటు ఉండాలని రోటరీ సెంటీనియల్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగిన రాష్ట్ర అథ్లెటిక్ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక చంద్రమౌళీ నగర్‌లోని నాథ్ వెల్‌నెస్ సెంటర్లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ అథ్లెట్స్‌కు తమ సహాయ, సహకారాలుంటాయని తెలిపారు. జిల్లా అథ్లెటిక్ సంఘం జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ మొత్తం 44 మందికి పతకాలు రాగా అందులో 14 మంది జాతీయ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. రాష్ట్ర పోటీలకు స్పాన్సర్‌షిప్స్ రావడం వల్లే ఈ పతకాలు సాధించారని పేర్కొన్నారు. అనంతరం అథ్లెట్స్‌ను సత్కరించారు. కార్యక్రమంలో నాథ్ వెల్‌నెస్ సెంటర్ చీఫ్ కోచ్ ఎస్.గోపీనాథ్, కోచ్‌లు కె.రవి, బి.కృష్ణారావు, జి.జె. కిశోర్, శివారెడ్డి, సీహెచ్‌వి. రాజు, నాని, సుబ్బారావు పాల్గొన్నారు.

సమగ్ర వ్యవసాయంతోనే రైతుకు లాభాలు

– వెటర్నరీ డాక్టర్ వీపీఎస్ రాంబాబు

గుంటూరు రూరల్ : ఒకప్పుడు ప్రతి రైతు పంటల సాగుతోపాటు కొన్ని పశువులు, కోళ్ళు, మేకలు, గొర్రెలు పోషిస్తూ ఆనందంగా జీవితాలను గడిపేవారని కడపకు చెందిన వెటర్నరీ డాక్టర్ వీపీఎస్ రాంబాబు తెలిపారు. శుక్రవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో సమగ్ర వ్యవసాయంపై రైతు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రైతులు తిరిగి పంటల సాగుతోపాటు పశుపోషణ చేపట్టి కోళ్ళు, మేకలు, గొర్రెలు పెంపకాన్ని చేపట్టాలన్నారు. అన్ని మెళకువలు పాటించి గొర్రెలు, మేకల పెంపకం చేపట్టటం వల్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు. నందివెలుగు రైతు మీసాల రామకృష్ణ, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై. వేంకటేశ్వరరావు సేంద్రియ సాగులో దేశీయ జాతి ఆవుల ప్రాముఖ్యత, పశు గ్రాసాల గురించి వివరించారు.